క్లుప్తంగా

గ్రేడ్-1 ఎగ్జిక్యూటివ్ అధికారిగా ప్రసాద్‌రాజు

సీటీఆర్‌ఐ: రాజమహేంద్రవరంలోని గోదావరి గట్టున ఉన్న ఉమా మార్కండేయేశ్వర స్వామి ఆలయానికి గ్రేడ్-1 నూతన ఎగ్జిక్యూటివ్ అధికారిగా ఎస్‌వీఎస్ఎస్‌వీ ప్రసాద్‌రాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు అమలాపురంలో ఉమా కుక్కుటేశ్వర దేవాలయంలో గ్రేడ్-2 అధికారిగా పనిచేశారు. పదోన్నతిపై ఇక్కడకు వచ్చిన ప్రసాద్‌రాజుకు ఆలయ ఈఓ ఆర్.శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం

కడియం: కడియపులంకలో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయం వార్షికోత్సవ వేడుకలు బుధవారం ముగిశాయి. సుమారు 160 మంది భక్తులు ఆంజనేయ మాలలు ధరించి, కొద్ది రోజులుగా యజ్ఞ,యాగాలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు పాల్గొని, ఆలయ ప్రధానార్చకుడు శ్రీరామచంద్రమూర్తిని సత్కరించారు. దేవాలయ చైర్మన్ పల్ల సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సీబీఎస్‌ఈ పరీక్షలు

కంబాలచెరువు: సీబీఎస్‌ఈ సిలబస్ 8, 9 విద్యార్థులకు టర్మ్-2 పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యా శాఖాధికారి ఈవీబీఎన్.నారాయణ తెలిపారు. స్థానిక బైపాస్ రోడ్‌లోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు.

విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నుల పంపిణీ



విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేస్తున్న రామ్‌కిరణ్

ప్రకాశం నగర్: గోరంట్ల సంతారావ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం కంబాల చెరువు మున్సిపల్ హైస్కూల్‌లో సంస్థ నిర్వాహకులు రవి రామ్‌కిరణ్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నుల సెట్‌ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరాలని, పరీక్షల్లో విజయం సాధించాలన్నారు. ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

నర్సరీ రైతు రావిపాటికి మాతృ వియోగం



రావిపాటి మహాలక్ష్మి(ఫైల్)

కడియం: కడియపులంక శ్రీవిజయదుర్గ నర్సరీ రైతు రావిపాటి రామకృష్ణ, వెంకటేష్‌కు మాతృ వియోగం కలిగింది. వారి తల్లి రావిపాటి మహాలక్ష్మి(67) హైదరాబాద్ గ్లోబల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ, మంగళవారం తుది శ్వాస విడిచారు. ఆమె భర్త ఆదినారాయణ గతేడాది జనవరిలో గుండె పోటుతో ఆకస్మికంగా కన్నుమూశారు. కాగా మహాలక్ష్మికి కుమారులతో పాటు, కుమార్తె పెనుమాక నాగలక్ష్మి, అల్లుడు బుల్లికొండయ్య ఉన్నారు. మహాలక్ష్మి భౌతికకాయాన్ని నర్సరీ రైతులు సందర్శించి, నివాళులర్పించారు. గ్రామంలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు.

నేడు ఉచితంగా కిడ్నీ స్క్రీనింగ్ టెస్ట్‌లు

ప్రకాశం నగర్: వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా స్థానిక కంబాలచెరువు వద్దనున్న రవి చైతన్య కిడ్నీ అండ్ చిల్డ్రన్స్ ఆస్పత్రిలో గురువారం ఉచితంగా కిడ్నీ స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నామని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ వై.రవిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పాటు అవసరమైన వారికి స్కానింగ్‌లో ప్రత్యేక రాయితీ అందిస్తున్నట్టు తెలిపారు. ఆస్పత్రిలో కిడ్నీ బయాప్సీలు, హీమో డయాలసిస్, పీడియాట్రిక్ డయాలసిస్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


మున్సిపాలిటీలకు పీపీఈ కిట్లు


ప్రకాశం నగర్: జిల్లాలో నమస్తే ప్రోగ్రాం ద్వారా కొవ్వూరు మున్సిపాలిటీకి 4, నిడదవోలు మున్సిపాలిటీకి 29 పీపీఈ కిట్లు అందజేసినట్టు జిల్లా సాంఘిక సంక్షేమాధికారి ఎం.సందీప్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ డీవీ ప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 414 మందికి రూ.14,50,68,219 మేర ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చినట్టు వివరించారు. పీఎం దీక్షిత్ ద్వారా 278 మందికి రూ.73,42,413, స్త్రీనిధి ద్వారా 64 మహిళా సంఘాలకు రూ.1,87,49,520 ప్రయోజనం కలిగిందని చెప్పారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు పి.సువర్ణ, ఎం.భానుప్రకాష్, డీఆర్‌డీఏ పీడీ ఎస్.మూర్తి, డీఎల్‌డీఓ పి.వీణాదేవి, జిల్లా బీసీ సంక్షేమాధికారి పీఎస్ రమేష్ పాల్గొన్నారు.

ఏప్రిల్ 5 నుంచి యూత్ ఫెస్ట్

కంబాలచెరువు: రాష్ట్ర స్థాయిలో యూత్ ఫెస్టివల్‌ను స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఏప్రిల్ 5, 6, 7 తేదీల్లో ఉద్భవ్ పేరుతో నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రరావు బుధవారం తెలిపారు. రాష్ట్ర స్థాయిలో విద్యార్థులు నిర్వహించే తొలి ప్రభుత్వ స్టూడెంట్ ఫెస్ట్ అన్నారు. అధ్యాపకుల ప్రమేయం లేకుండా విద్యార్థులే నిర్వహిస్తారన్నారు. సాంస్కృతిక, ఆటల పోటీలు ఉంటాయన్నారు.

మురుగుకు మోక్షం







అపార్ట్‌మెంట్ల మధ్య ఉన్న మురుగు

అపార్ట్‌మెంట్ల మధ్య సిమ్మెంటుతో చేసిన చప్టా

అపార్ట్‌మెంట్లకు ఏర్పాటు చేసిన కొత్త పైపులైన్లు

- రాజీవ్ గృహకల్పకు మహర్దశ
- అపార్ట్‌మెంట్ల మధ్య శాశ్వత పరిష్కారంగా సిమెంటు చప్టాలు
- ధ్వంసమైన పైపుల స్థానే కొత్తవి ఏర్పాటు
- మంత్రి వేణు చొరవతో తీరిన కష్టాలు

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ గ్రామంలో గత నెల 23న స్వచ్ఛత-మన బాధ్యత కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వేణుగోపాలకృష్ణ రాజీవ్ గృహకల్ప సముదాయాన్ని చూసి నిర్ఘాంతపోయారు. పేద ప్రజలు నివసించే అపార్ట్‌మెంట్ల మధ్య మురికికూపాలను చూసి చలించిపోయారు. శాటిలైట్‌సిటీ గ్రామాన్ని దత్తత తీసుకున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి.. మురుగును తొలగించేందుకు కొబ్బరికాయలు కొట్టారు మినహా ఏమీ చేయలేదని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో అపార్ట్‌మెంట్ల మధ్య మురుగును పూర్తి స్థాయిలో తొలగించి, సిమ్మెంటు చప్టాలు నిర్మించి, నీరు నిల్వ లేకుండా చూడాలని ఎంపీడీఓ, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అపార్ట్‌మెంట్లలో పగిలిన పైపులైన్లను తొలగించి, కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు.

కార్యాచరణలోకి మంత్రి సూచనలు

రాజీవ్ గృహకల్ప సముదాయంలో మండల పరిషత్ నిధులతో మంత్రి వేణు ఆదేశాల మేరకు ఎంపీడీఓ, ఇంజినీరింగ్ అధికారులు అపార్ట్‌మెంట్ల మధ్య ఉన్న మురుగును పూర్తిస్థాయిలో తొలగించారు. సుమారు 40 లారీలకు పైగా మురుగు ఉన్నదంటే, ప్రజలు ఏ మేరకు ఇబ్బందులు పడ్డారో అవగతమవుతుంది. మురుగు తొలగించిన ప్రాంతంలో అపార్ట్‌మెంట్లకు మధ్య సిమెంటుతో చప్టా చేయించడంతో పాటు, దెబ్బతిన్న మంచినీటి పైపులైన్లు, వాడకం నీరు వెళ్లే పైపులైన్లను సైతం పూర్తి స్థాయిలో కొత్తవి ఏర్పాటు చేశారు. దీంతో ఇప్పుడు అపార్ట్‌మెంటు వాసుల కష్టాలు దాదాపు తీరిపోయాయి. ఇలా మురుగు ఎక్కువగా ఉండే అపార్ట్‌మెంట్ల మధ్యలో సిమెంటు చప్టాలు వేయడంతో పాటు, పాడైన పైపులైన్లన్నీ మార్పు చేస్తారని అధికారులు చెబుతున్నారు. మంత్రి వేణు చొరవతో కొన్నేళ్లుగా నెలకొన్న సమస్యలు తీరాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వెంటనే స్పందించారు



మంత్రి వేణుగోపాలకృష్ణ అపార్ట్‌మెంట్ల మధ్య మురుగును చూసి వెంటనే స్పందించారు. ఏళ్లనాటి సమస్యను వెంటనే తీర్చారు. అపార్ట్‌మెంట్ల మధ్య మురుగు ఉండడం వల్ల దుర్వాసనతో పాటు, దోమలతో నిద్రాహారాలు ఉండేవి కావు. కొత్త పైపులైన్ల ఏర్పాటుతో సిమ్మెంటు చప్టా చేయించడం వల్ల ఇక ఎటువంటి ఇబ్బంది ఉండదు.

– కాయల సూరిబాబు, రాజీవ్ గృహకల్ప సముదాయం

బాగా చేశారు



అపార్ట్‌మెంట్ల మధ్య మురుగు వల్ల అనేక ఇబ్బందులు పడ్డాం. మంత్రి వేణుగోపాలకృష్ణ మా ప్రాంతానికి వచ్చి సమస్యను చూసి వెంటనే స్పందించడంతో పాటు, పరిష్కరించారు. లీకేజీ ఉన్న పైపులైన్లను మార్చడంతో పాటు, సిమ్మెంటు చప్టా చేయడంతో ఎటువంటి దుర్వాసన, దోమలు బెడద లేదు. సీఎం జగన్ ప్రభుత్వంలోనే పేదవాడికి మేలు జరుగుతుందన్న నమ్మకం ఉంది.

– పి.పార్వతి, రాజీవ్ గృహకల్ప సముదాయం

ప్రాణం తీసుకునేలా ప్రచారం చేశారు

గీతాంజలి మృతిపై షర్మిలారెడ్డి ఆవేదన



మేడపాటి షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: జగనన్న సంక్షేమ పథకాలకు లబ్ధి పొందిన మహిళా లోకమే ప్రచారకర్తలుగా మారిన తరుణంలో.. సంక్షేమాభివృద్ధిపై విష ప్రచారం చేస్తున్న టీడీపీ-జనసేన సోషల్ మీడియా ఉన్మాదులు గుంటూరుకు చెందిన గీతాంజలిని పొట్టన పెట్టుకున్నారని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చెర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి విచారం వ్యక్తం చేశారు. బడుగు సామాజిక వర్గానికి చెందిన గీతాంజలిని జగనన్న పాలనలో తన కుమార్తెకు అమ్మ-ఒడి పథకంతో పాటు, పేద మహిళల కోటాలో ఇంటి పట్టా పొందిన ఆనందంలో సోషల్ మీడియాలో ప్రభుత్వ సంక్షేమ పాలనపై ప్రశంసలు కురిపించడం జీర్ణించుకోలేని టీడీపీ-జనసేన సోషల్ మీడియా.. గీతాంజలిని పొట్టన పెట్టుకునే వరకూ ఆమె వ్యక్తిత్వాన్ని, కుటుంబ పరువును బజారుకీడ్చేలా వ్యవహరించడం అత్యంత హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్మాదుల్లా తయారైన జనసేన-టీడీపీ సోషల్ మీడియా హ్యాకర్లను గుర్తించి, ఫేక్ ఫొటోలు, వీడియోలతో మహిళలను కించపరుస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకునేలా పౌర సమాజం కూడా స్పందించాలని కోరారు. ఇప్పటికే గీతాంజలి కుటుంబానికి జగనన్న ఆర్థిక సాయాన్ని ప్రకటించారని, భవిష్యత్తులో గీతాంజలి కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో టీడీపీ-జనసేన సోషల్ మీడియా ఉన్మాదులు మరింత దురాగతాలకు ఒడిగట్టే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జగనన్న ప్రభుత్వాన్ని సమర్థిస్తూ.. అభివృద్ధిపై సోషల్ మీడియా వేదికగా సామాన్యులు, గృహిణులు తమ సంతోషాలు పంచుకుంటున్న తరుణంలో, పచ్చ మీడియా బ్యాచ్ వ్యక్తిత్వ హననం చేసేలా వీడియోలు, మార్ఫింగ్ ఫొటోలతో ఆయా కుటుంబాలను భయభ్రాంతులను చేసే ప్రమాదాన్ని వైఎస్సార్ సీపీ శ్రేణులు ఇప్పటికే గుర్తించారన్నారు. ఈ అరాచక మూకల ఆగడాలకు చెక్ పెట్టేందుకు పౌర సమాజం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గీతాంజలి మృతికి కారకులైన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని కోరారు. టీడీపీ-జనసేన సోషల్ మీడియా బాధితులు, వేధింపులకు గురవుతున్న వారు ధైర్యంగా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

సంక్షేమాభివృద్ధికి జగన్ పెద్దపీట

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణు
- రూ.3.60 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



హుకుంపేట నాగిరెడ్డినగర్‌లో సీసీ రోడ్డు, డ్రైన్లకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమంతో పాటు, అభివృద్ధికీ పెద్దపీట వేశారని, తద్వారా గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. బుధవారం రూ.3.50 కోట్లు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో హుకుంపేట, పిడింగొయ్యి, శాటిలైట్‌సిటీ గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు, హుకుంపేట పంచాయతీ నిధులు రూ.10 లక్షలతో ఎస్సీ పేటలో పార్కు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ స్వచ్ఛత-మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటించినప్పుడు ప్రజలు విన్నవించిన సమస్యలతో పాటు, ఐదేళ్ల పాటు స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం వల్ల గ్రామాల్లో అనేక సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. గ్రామాల్లో అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. హుకుంపేట ఎస్సీ పేటలో పార్కు నిర్మాణం, గణేష్‌నగర్, చైతన్యనగర్, నాగిరెడ్డినగర్, శాంతిపురంలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం, పిడింగొయ్యి పంచాయతీలోని కవలగొయ్యి, బుచ్చియ్యనగర్, శ్రీలక్ష్మీనగర్, జైహింద్‌నగర్, పిడింగొయ్యిల్లో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి, శాటిలైట్‌సిటీలో సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులకు శంకుస్థాపన చేసినట్టు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. గ్రామాలను, పట్టణాలను కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛత కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని, ప్రజలు తమవంతు సహకారాన్ని అందించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ డి.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసబాబు, ఏఈ సంపత్ కుమార్, మాజీ ఎంపీపీ రేలంగి వీరవెంకట సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, గ్రామాల సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు, పంచాయతీ కార్యదర్శులు జి.వెంకటరావు, ముదునూరి రూప్‌చంద్, టి.కృష్ణ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

తక్కువ ధరకు నాణ్యమైన మందులు

రాజమహేంద్రవరం రూరల్: ప్రజల ఆరోగ్య సంరక్షణలో అధిక వ్యయాన్ని తగ్గించడం కోసం, ముఖ్యంగా పేదలకు తక్కువ ధరకు నాణ్యమైన మందులను అందించడమే లక్ష్యంగా జన ఔషధి కేంద్రాల ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో-ఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. బుధవారం హుకుంపేట గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో రూ.ఏడు లక్షలతో నిర్మించిన భవనంలో ఏర్పాటు చేసిన జన ఔషధి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ జన ఔషధి కేంద్రాల్లో విక్రయించే మందులు ఖరీదైన బ్రాండెడ్ ఔషధాలకు సమానమైన నాణ్యత, సమర్థతను కలిగి ఉంటాయన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ జన ఔషధి కేంద్రాల్లో తక్కువ ధరకు మందులు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బొప్పన సుబ్బారావు, సభ్యులు చీరా రాజు, ఏలూరి లోకేష్, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, డీసీసీబీ నోడల్ ఆఫీసర్ ఎస్.ఉమారాణి, సంఘ సీఈఓ బొడ్డేడ రాంబాబు, తొర్రేడు, రాజవోలు సొసైటీ అధ్యక్షులు చిట్టూరి వెంకటరావు, గిరిజాల రామకృష్ణ, రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల చేతుల్లో సమాజ భవిష్యత్తు

- డీఎస్ఈఓ కె.వాసుదేవరావు
- ఘనంగా డీఈఎల్‌డీ స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో ఛాత్రోపాధ్యాయులను సత్కరిస్తున్న వాసుదేవరావు, సుభాషిణి తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: సమాజ భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. బుధవారం బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో డీఈఎల్‌డీ 2021-23 బ్యాచ్ స్నాతకోత్సవ వేడుకలు ప్రిన్సిపాల్ డా.ఎస్‌డీవీ రమణ అధ్యక్షతన జరిగాయి. ముఖ్యఅతిథి కె.వాసుదేవరావు మాట్లాడుతూ ప్రస్తుత విద్యా వ్యవస్థలో మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయుల బోధన ఉండాలని సూచించారు. సమగ్ర శిక్షా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి మాట్లాడుతూ ఛాత్రోపాధ్యాయులు త్వరలో జరగబోయే డీఎస్సీ ఉపాధ్యాయ పోస్టులకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ డా.రమణ మాట్లాడుతూ కాబోయే ఉపాధ్యాయులు విలువలతో కూడిన సమాజాన్ని అందించాలని కోరారు. అనంతరం 2021-23 బ్యాచ్‌లో 31 కేటగిరీల్లో టాపర్లుగా నిలిచిన 23 మందికి నగదు బహుమతులుగా రూ.5,300ను సీనియర్ లెక్చరర్ కొమ్ముల వెంకట సూర్యనారాయణ, ఆయన సోదరుడు రాంగోపాల్ వారి తల్లిదండ్రులు చంద్రరావు, సూర్యభాస్కరమ్మ స్మారకార్థం అందజేశారు. అనంతరం వీరిని వాసుదేవరావు, సుభాషిణి శాలువాలతో సత్కరించి, డైట్ కేలండర్, డైట్ మేగజైన్, కొమ్ముల వెంకట సూర్యనారాయణ రచించిన బాల కథా చంద్రిక పుస్తకాలను అందజేశారు. సీనియర్ లెక్చరర్ ఆర్‌జేడీ రాజు, సుజా తారత్నం, జానకీదేవి, వీరభద్రరావు, చూడామణి, సత్యనారాయణ, బాలరాజు, గంగాధర్, ఎస్తర్, కళావతి, రాజేష్ పాల్గొన్నారు.

సచివాలయాలతో పారదర్శక సేవలు

మంత్రి వేణుగోపాలకృష్ణ



ధవళేశ్వరంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

ధవళేశ్వరం: సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పారదర్శక సేవలు అందుతున్నాయని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పాలనా సంస్కరణల్లో భాగంగా ప్రజల వద్దకే ప్రభుత్వ యంత్రాంగం వచ్చి, పౌర సేవలన్నీ అందించేందుకు సచివాలయ వ్యవస్థను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారని చెప్పారు. బుధవారం ధవళేశ్వరంలో రూ.2.03 కోట్లతో నిర్మించిన మూడు గ్రామ సచివాలయ భవనాలు, నాలుగు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజుతో కలిసి మంత్రి ప్రారంభించారు. రూ.50 లక్షలతో నిర్మించనున్న రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మంత్రి వేణు మాట్లాడుతూ ప్రజారోగ్యానికి భద్రత కల్పించేలా ప్రతి గ్రామంలోనూ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తోందన్నారు. ప్రతి గ్రామాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, ఎంపీడీఓ డి.శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ సంపత్‌కుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన మూల్యం చెల్లించక తప్పదు



ర్యాలీలో పాల్గొన్న రౌతు సూర్యప్రకాశరావు, అడపా శ్రీహరి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: జగనన్నకే ఓటు వేస్తానన్న తెనాలికి చెందిన గీతాంజలిపై టీడీపీ-జనసేన సోషల్ మీడియా సైకోలు వెంటాడి, ఆమె ఆత్మహత్యకు కారకులయ్యారని రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు ఆరోపించారు. బుధవారం రాత్రి స్థానిక కోటగుమ్మం సెంటర్లో వైఎస్సార్ సీపీ నగర కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. గీతాంజలి చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రౌతుతో పాటు, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా తాము పొందిన లబ్ధిని గొంతు విప్పి చెప్పడం కూడా ప్రతిపక్షాలకు వెగటుగా అనిపిస్తోందని మండిపడ్డారు. గీతాంజలి ఘటనకు టీడీపీ-జనసేన పార్టీలు తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. ఆమె మృతికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుకుల గాండ్ల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిస భవానీప్రియ, సిటీ పరిశీలకుడు రావిపాటి రామచంద్రరావు, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి పాల్గొన్నారు.

పిల్లలను సన్మార్గంలో నడిపించాలి

కంబాలచెరువు: మహిళలు వారి కుటుంబాలకు మార్గదర్శకంగా ఉండాలని, పిల్లలను తీర్చిదిద్ది సన్మార్గంలో నడిపించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయమూర్తి కె.ప్రత్యూషకుమారి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, భూమిక ఎన్‌జీఓ సంయుక్తాధ్వర్యంలో స్థానిక అన్నపూర్ణమ్మపేటలో బుధవారం మహిళల సాధికారత, మహిళల చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఆమె మాట్లాడుతూ కుటుంబ బాధ్యతలను నిర్వర్తించడంలో మహిళల పాత్ర కీలకమైందన్నారు. ఇంట్లో ప్రశాంతత నెలకొల్పడంలో మహిళలు విఫలమైతే, కుటుంబ సభ్యులపై, పిల్లలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ పి.సూర్యప్రభావతి, సీడీపీఓ నరసమ్మ, డీసీపీఓ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మొల్లమాంబ భక్తి అనితర సాధ్యం



మొల్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ మాధవీలత



కవయిత్రి మొల్లకు నివాళులర్పిస్తున్న డీఎంహెచ్ఓ డా.వెంకటేశ్వరరావు తదితరులు



మొల్ల చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ జగదీష్

- కలెక్టర్ మాధవీలత
- ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): అనితర సాధ్యమైనది మొల్లమాంబ భక్తి అని కలెక్టర్ మాధవీలత కొనియాడారు. బుధవారం కలెక్టరేట్‌లో మొల్లమాంబ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 16వ శతాబ్దానికి చెందిన తెలుగు కవయిత్రి అతుకూరి మొల్లమాంబ జయంతిని నిర్వహించినట్టు చెప్పారు. తెలుగులో మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందిన రామాయణం శైలి చాలా సరళమైనదని, రమణీయమైనదిగా ప్రసిద్ధి చెందిందన్నారు. ఆరు కాండాల్లో 871 పద్యాలతో కూడిన రామాయణాన్ని కేవలం ఐదు రోజుల్లో రాసిందని చరిత్ర చెబుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొల్లమాంబ స్మరిస్తే.. శ్రీరాముడిని స్మరించినట్టే..

కవయిత్రి మొల్లమాంబను స్మరిస్తే శ్రీరాముడిని స్మరించినట్టేనని కళారత్న, ఆచార్య దేవగుప్త రాజకుమార్ వడయార్ అన్నారు. స్థానిక గౌతమి ఘాట్ వద్ద మొల్లమాంబ జయంతి వేడుకలను సోమవారం రాత్రి నిర్వహించారు. మొల్లమాంబ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వడయార్ మాట్లాడుతూ వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణాన్ని ఆధారంగా చేసుకుని, మొల్లమాంబ తేట తెలుగులో కంద పద్యాలతో రచించినట్టు చెప్పారు. అందుకే మొల్ల రామాయణాన్ని కంద రామాయణం అని కూడా అంటారన్నారు. చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మొల్లమాంబ విగ్రహ నిర్వహణ కమిటీ సభ్యులు రాయపూడి శ్రీనివాసరావు, కోశ్వరరావు, బి.గంగాధర్, గౌతమీ ఘాట్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బాజ్జి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

రాజమహేంద్రవరం రూరల్: తెలుగులో మొల్లమాంబ రాసిన రామాయణం మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందిందని, అలాగే మహిళలు అన్ని రంగాల్లోను అభివృద్ధి చెందాలని డీఎంహెచ్ఓ డా.కె.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం బొమ్మూరులోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో కవయిత్రి మొల్ల జయంతిని ఘనంగా నిర్వహించారు. పరిపాలనాధికారి సత్యకుమార్, సూపరింటెండెంట్ సత్యనారాయణ, ఈఓ అభిషేక్, మౌనిక, సీనియర్ అసిస్టెంట్ ఏసుబాబు, రజియా, జాన్సన్‌రాజు, సుధీర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లకు ఎస్పీ నివాళులు

కంబాలచెరువు: కవయిత్రి మొల్ల జయంతి జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం జరిగింది. జిల్లా ఎస్పీ పి.జగదీష్ మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్.చెంచిరెడ్డి, డీఎస్పీ ఎస్‌బీ డి.ప్రభాకర్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.